పాఠశాలను యథావిధిగా కొనసాగించండి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

పాఠశాలల విలీనం వలన గూడూరు నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలలో విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్ళలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యార్థుల తల్లి తండ్రులు, ప్రజా ప్రతినిధులు వచ్చి విజ్ఞప్తి చేస్తున్నారని, కొన్ని స్కూల్ కి మినహాయింపు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు గూడూరు శాసన సభ్యులు సునీల్ కుమార్ వినతి పత్రం అందజేశారు.

కలెక్టర్‌కు గూడూరు ఎంఎల్‌ఎ వినతి

ఇది.. నా అడ్డా..!
ఎంతైనా..తవ్వుకుంటా..!

- నదుల్ని నలిపేస్తూ..
- చెరువుల్ని చిదిమేస్తూ..
- యథేచ్ఛగా ఇసుక, మట్టి, గ్రావెల్ మాఫియా
- ప్రకృతి వనరులు పోతున్నా పట్టనివైనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లాలో ఇసుక, మట్టి, గ్రావెల్ మాఫియా అడ్డూ అదుపూ లేకుండా చెలరేగిపోతోంది. నదుల్ని నలిపేస్తూ.. చెరువుల్ని చిదిమేస్తూ ప్రకృతి వనరులను కొల్లగొట్టేస్తున్నారు. కొండా.. గుట్ట.. వాగూ..వంకా.. చెరువు గట్టూ.. కాలువ కట్ట..అదీ ఇదీ అనే తేడా లేకుండా.. కన్ను పడితే చాలు.. కొల్లగొట్టి కాసులు పిండుకుంటున్నారు. ప్రయివేట్ వెంచర్లు, స్థలాలు, భూములు చదును, గృహ నిర్మాణాలకు ప్రస్తుతం బాగా డిమాండ్ పెరగడంతో 'గద్దల కన్ను' ఇసుక, మట్టి, గ్రావెల్ పై పడింది. ఆయా ప్రాంతాల్లో పట్టున్న నాయకులు ఆ పార్టీ.. ఈ పార్టీ అనే బేధం లేకుండా ప్రకృతి వనరులను దోచే పనిలో పడ్డారు. కాస్త పలుకుబడి ఉపయోగిస్తే చాలు ఇబ్బడిముబ్బడిగా ఆదాయం వస్తుండటంతో నాయకులు అక్రమ తవ్వకాలను ప్రధాన వనరుగా మార్చుకుంటున్నారు. జిల్లాలో సహజ వనరుల దోపిడీని అరికట్టాలని కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీపీఎం పోరాటం చేస్తోంది. అయినా అధికార యంత్రాంగంలో చలనం లేదు. ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సహజ వనరుల దోపిడీ మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ఇక్కడి 'అధికార' యంత్రాంగం ఉదాసీనతగా వ్యవహరిస్తుండటంతో అడిగేదెవరూ..అడ్డుకునేవారెవరు అంటూ అక్రమార్కులు రెచ్చిపోతున్న పరిస్థితి నెలకొంది.

ఎక్కడికక్కడ అనధికారిక వసూళ్లు

మట్టి, కంకర, గ్రావెల్ దేన్నీ చూసినా మాఫియా నాయకుల కళ్ళు మెరుస్తున్నాయి. అక్రమంగా తవ్వేసి అప్పనంగా డబ్బు సంపాదించాలని ఆరాటంగా అడుగేస్తున్నారు. అనుకున్నదే తడవుగా రంగంలోకి దిగేసి కాసులు కొల్లగొట్టేస్తున్నారు. కొన్నిచోట్ల కుటుంబసభ్యులు, అనుచరులను ముందుపెట్టి దందా నడిపిస్తున్నారు. మరికొన్ని చోట్ల స్థానిక నేతలు కప్పం నిర్ణయించి మరీ తవ్వకాలకు అనధికారిక అనుమతులిస్తున్నారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని స్వర్ణముఖి నదిలో ఇసుకను తవ్వుకునేందుకు, తరలించేందుకు స్థానికంగా ఉన్న నేతలకు కప్పం కట్టాల్సి వస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇసుక ఉచితమే అయినా ట్రాక్టర్ కు, జేసీబీలకు ఇంతని కప్పం వసూళ్లు చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. ఈ లెక్కన రోజుకు స్వర్ణముఖి నది నుంచి రూ. లక్ష ఆదాయన్ని మాఫియా నేతలు గడిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చెరువుల్ని చెరబట్టి అక్రమార్కులు ప్రైవేటు వెంచర్లకు మట్టిని తరలిస్తున్నారు. రేణిగుంట మండలంలోని తూకివాకం చెరువు, శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు, చుక్కలనిడిగల్లు, టీఎంవీ కండ్రిగ, ఎంఎన్నీ కండ్రిగ, వేడాం, తొట్టంబేడు మండలంలోని గుండెలిగుంట, తాటిపర్తి, కల్లిపూడి, కాసారం, శివనాదపాలెం, కంచనపల్లి గ్రామాల చెరువుల నుంచి ప్రైవేటు వెంచర్లకు మట్టి, గ్రావెల్ ను గత కొంతకాలంగా నిరంతరం తరలిస్తున్నారు.

ఇష్టానుసారంగా తవ్వడంతో చెరువుల మౌలిక ఆకృతి దెబ్బతింటోంది. మట్టి కోసం ఎక్కువ లోతుకు తవ్వేయడంతో చెరువు పూర్తిగా నిండనప్పుడు ఆ గోతుల్లో నీరు నిలిచిపోయి ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరు అందదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తవ్వకాలతో కట్ట బలహీనమవుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం నిద్రమత్తు వీడి ఇసుక, మట్టి, గ్రావెల్ మాఫియాకు అడ్డుకట్ట వెయ్యాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మీ బడి... మీకే..?

పోరాటాల ఫలితం...
'విలీనం'పై విజయం..
ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం

పివిపురం పోరాటం (ఫైల్)

ప్రజాశక్తి - తిరుపతి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల విలీన విధానం పై అటు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తులు, విద్యార్థి ఉపాధ్యాయ సంఘాల పోరాట ఫలితం... విలీనంపై విజయం సాధించింది. ' మా బడి ...మాకే కావాలి' అంటూ ప్రతిఘటన ఎదురైన చోట విలీనం వద్దంటూ ప్రభుత్వానికి అధికారులు సైతం సిఫార్సులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో ప్రభుత్వం ఎట్టకేలకు దిగి రాక తప్పలేదు. తిరుపతి జిల్లాలో ప్రధానంగా రామచంద్రాపురం మండలం పివిపురం, ఏర్పేడు మండలం పల్లంపేట, నారాయణవనం మండలం గోవిందప్ప కండ్రిగ ,పీలేరు మండలం లోని పాపట్లపల్లె, కేబీవీపురం మండలం ఓ.నగత్తూరు, చిత్తూరు నగరం ఎం. అగ్రహారం, పుత్తూరు మండలం చెర్లోపల్లె, పలమనేరు మండలం పాలమాకులపల్లె, గంగాధర నెల్లూరు మండలం పీ అగ్రహారం, పీలేరు లోని పెద్దిరెడ్డిపల్లె , మాగనవల్లెల్లో తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలల విలీనంకు తాము ఒప్పుకోమంటూ ఎదురు తిరిగారు. అవసరమైతే నిరాహార దీక్షలకు సిద్ధమంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లాలో 9, చిత్తూరు జిల్లాలో

పల్లంపేట పోరాటం (ఫైల్)

11చోట్ల విలీన ప్రక్రియ రద్దు చేసుకుంటేనే మంచిదని అభిప్రాయానికి విద్యాశాఖ అధికారులు వచ్చినట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి విన్నవించినట్లు సమాచారం. ఇదే సందర్భంలో ప్రభుత్వం నుంచి కూడా సానుకూలత వ్యక్తమైనట్లు విశ్వసనీయ సమాచారం.

జగన్ విధానాలే..కూటమి హయాంలోనూ..

సిపిఎం రాష్ట్ర నేత మూలం రమేష్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గతంలో జగన్మోహన్‌రెడ్డి చేసిన విధానాలనే పేరు మార్చి కొనసాగిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్ విమర్శించారు. శుక్రవారం యశోదానగర్‌లోని సిపిఎం కార్యాలయంలో సాయిలక్ష్మి అధ్యక్షతన సిపిఎం ప్రాంతీయ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మూలం రమేష్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవోను రద్దు చేస్తామని ఎన్నికల హామీగా చెప్పారని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక జీవో నంబర్ 117ను రద్దు చేసి, దాని స్థానంలో మెమో నంబర్ ఇఎస్ఇ 02-13021/4/2024 ను తీసుకొచ్చి రాష్ట్రంలో 33వేల ప్రాథమిక పాఠశాలలను, 28వేలకు పరిమితం చేశారన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా తిరుపతి జిల్లాలోనే 583 ప్రాథమిక పాఠశాలలు విలీనం చేయడం బాధాకరమైన విషయం అన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని, ప్రభుత్వ ప్రోత్సాహం కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యిందన్నారు. జిల్లాలో గ్రావెల్ మాఫియా అడ్డూ అదుపు లేకుండా దోచుకుంటున్నా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందన్నారు. తిరుపతి నగర శివార్లలోని వేణుగోపాల్ కాలనీలో 70 ఇళ్లను అర్ధరాత్రి కూల్చేసినా నెలరోజులు గడిచినా ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి తేడా ఏమీ లేదన్నారు. ఈ సమావేశం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, టి. సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సిపిఎం ప్రాంతీయ నేతలతో మాట్లాడుతున్న మూలం రమేష్

వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత అవసరం

ప్రజాశక్తి - క్యాంపస్

వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై శాస్త్రవేత్తలు దష్టి సారించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఇంచార్జీ విసి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి పిలుపునిచ్చారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన 'వ్యవసాయంలో సవాళ్లు -వాతావరణ అనుకూలిత -నూతన ఆవిష్కరణలు' అనే అంశంపై జాతీయ సదస్సును శుక్రవారం వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తలు వివిధ విభాగాల శాస్త్రవేత్తలతో కలిసి పరిశోధనలు చేపట్టడం ద్వారా, ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగం పరిశోధనలు వినియోగించడం ద్వారా ప్రస్తుతం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనడానికి వీలవుతుందన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడానికి దోహదపడుతుందన్నారు. ముఖ్య అతిథి యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ బెంగళూరు పూర్వ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎంఏ శంకర్ మాట్లాడుతూ నూతన వంగడాల దిగుబడి సామర్థ్యం పెంపొందించడానికి పంట యాజమాన్య పద్ధతులు కీలకమని తెలిపారు. రాష్ట్ర రైతు సాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ పి.విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో ప్రకతి వ్యవసాయ పద్ధతులు ద్వారా వ్యవసాయ రంగంలో గణనీయమైన పురోగతి సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ డి రాజిరెడ్డి, ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి వి సత్యనారాయణ, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి సుమతి పాల్గొన్నారు.

'ఎంఎస్ఎంఈ'లతో మెరుగైన ఉపాధి

- 60 నుండి 70 శాతం ప్రపంచవ్యాప్తంగా
- ఎగుమతి దిగుమతులకు 130 ఎంఒయులు
- రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటులో 30 శాతం వాటిదే..
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమీక్ష

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

'ప్రపంచవ్యాప్తంగా 'ఎంఎస్ఎంఈ'ల వలన 60 నుండి 70 శాతం ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న వ్యక్తి అని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ప్రత్యేక ప్రణాళికను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుంది' అని ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ, ఎంపవర్మెంట్ అండ్ రిలేషన్స్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవాన్ని తిరుపతి రూరల్ పరిధిలోని తాజ్ హొటల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగానే కాకుండా భారత దేశ ఆర్థిక వ్యవస్థలో ఎంఎస్ఎంఈల పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. రివర్స్ బయ్యర్స్ అండ్ సెల్లర్స్ వేదిక ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఎగుమతులు దిగుమతులకు సంబంధించి ప్రపంచ ఎంఎస్ఎంఈల దినోత్సవాన్ని పురస్కరించుకొని 130 ఎంఎస్ఎంఈ కంపెనీలు ఒప్పందాలు చేసుకున్నాయి. 2029 నాటికి ప్రతి ఇంటిలో ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలన్న ముఖ్యమంత్రి సంకల్పానికి అనుగుణంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నాలెడ్జ్ సెంటర్లను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐదు జోన్లలో ఏర్పాటుచేసి వాటికి

కార్పొరేట్ సంస్థలతో అనుసంధానం చేసే ప్రక్రియ త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఈ నాలెడ్జ్ సెంటర్స్ ద్వారా స్టార్ట్ అప్ కంపెనీలకు ఐపిఆర్, ప్రభుత్వం ఎంఎస్ఎంఈల పాలసీకి సంబంధించిన వివరాలు, జెడ్ సర్టిఫికేషన్ ద్వారా గ్లోబల్ మార్కెటింగ్ చేసుకోవడానికి వీలు కల్పిస్తామన్నారు. 175 నియోజకవర్గాల్లో ఉన్న మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ప్రైజెస్ కు సంబంధించి ఆయా జిల్లా కలెక్టర్లు వాటి పురోగతికి అవసరమైన అన్ని సేవలను అందివ్వనున్నారన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు జిల్లా నుండి తగిన సహకారాన్ని అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాలసీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు నైపుణ్యత తరగతులను, పరిశ్రమల నిర్వహణకు సంబంధించి అవగాహన కార్యక్రమాలను విడతల వారీగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో లక్ష 50 వేలకు పైగా ఉపాధి అవకాశాలు ఎంఎస్ఎంఈ సెక్టార్ నుండి పొందుతున్నారన్నారు. రానున్న కాలంలో మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడానికి కషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నేషనల్ ఎంఎస్ఎంఈ ఇంపాక్ట్ అవార్డులు 2025ను ప్రకటించారు. మహారాష్ట్రకు స్వర్ణ పతకం, ఆంధ్రప్రదేశ్‌కు రజిత పతకం, ఉత్తర ప్రదేశ్ కు కాంస్య పతకం లభించింది. అనంతరం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రోత్సాహకాలకు సంబంధించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల కార్యదర్శి డాక్టర్ ఎన్. యువరాజ్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ పాల్గొన్నారు.

'శ్రీసిటీ-ఐసాన్' వితరణతో విద్యావసతులు ప్రారంభం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో (సీఎస్ఆర్) భాగంగా శ్రీసిటీలోని జపాన్ పరిశ్రమ ఐసాన్ ఆటో పార్ట్స్ ఇండియా సుమారు 18.80 లక్షలతో నిర్మించిన వివిధ విద్యా వసతులను ఐసాన్ మేనేజింగ్ డైరెక్టర్ యసనోరి సకావే, శ్రీసిటీ డైరక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ విద్యా వసతులలో సూళూరుపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్ లో 6.50 లక్షల ఖర్చుతో అదనపు మరుగుదొడ్లు, వంట గది నిర్మాణం, సత్యవేడు మండలం రామచంద్రపురం గ్రామంలో 12.30 లక్షల వ్యయంతో నూతన అంగన్వాడీ భవనం నిర్మించారు. ఐసాన్ మేనేజింగ్ డైరెక్టర్ యసనోరి సకాయి మాట్లాడుతూ విద్యా వసతుల కోసం సీఎస్సార్ కార్యక్రమాలు చేపట్టడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ తరహా మరిన్ని విద్యాభివద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యులు అవుతామనని చెప్పారు. ఐసాన్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ యూచి టొమిట, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ గోపాల్, ప్రొడక్షన్ కోఆర్డినేటర్ తోషిహిరో సనా, మ్యానుఫ్యాక్చరింగ్ డిజిఎం దేవనాథన్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఆవుల ఘటన తిరుపతిలో కాదు : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్తిరుపతిలో మనుష్యులపై ఆవులు దాడిచేస్తున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని, ఆ ఘటన మహారాష్ట్రలోని నాశిక్‌లో జరిగిందని కమిషనర్ ఎన్.మౌర్య వెల్లడించారు. సోషల్ మీడియాలో తిరుపతిని ట్యాగ్ చేయడం సరికాదన్నారు. నగర పాలక సంస్థ వెటర్నరీ డాక్టర్ నాగేంద్ర ఆధ్వర్యంలో నగరంలో ఆవులు, కుక్కలు రోడ్లపై లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తను నమ్మవద్దని సూచించారు.

కొటారి నిర్మలకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ పరిశోధనా విద్యార్థిని కొటారి నిర్మలకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు సిఇ రాజామాణిక్యం తెలిపారు. అసోసియేట్ ప్రొఫెసర్ యన్. ఉషారాణి మార్గదర్శకత్వంలో "సమ్ స్టడీస్ అన్ అథంటికేషన్ అండ్ ప్రైవసీ ఇష్యూస్ ఫర్ మెడికల్ డేటా ఇన్ వైర్లెస్ సెన్సార్ నెట్వర్క్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు.

వెబ్‌ల్యాండ్‌లో మ్యుటేషన్ సక్రమంగా చేయండి :సిసిఎల్ఎ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లో మ్యూటేషన్ సక్రమంగా చేయాలని, ఎలాంటి తప్పులు చేయరాదని సిసిఎల్ఎ, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి సూచించారు. శుక్రవారం తిరుపతి అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో పుత్తూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లుతో ఆన్‌లైన్‌లో మాట్లాడారు. భూముల అమ్మకాలు, వాటి వివరాలు సక్రమంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహశీల్దార్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో కొనసాగుతున్న రిలేదీక్ష - టిటిడి ఛైర్మన్‌తో సిఐటియు చర్చలు

స్విమ్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

టీటీడీ చైర్మన్‌కు సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

స్విమ్స్ కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలికంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారని, స్విమ్స్ యాజమాన్యం సమస్యలు పరిష్కరించకుండా బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తోందని, టీటీడీ జోక్యం చేసుకొని పరిష్కరించాలని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకి సిఐటి యు నేతలు కందారపు మురళి, వేణుగోపాల్, స్విమ్స్ యూనియన్ నేతలు రవి, సూరి, మారి, ముత్తు, గోపి, వేలు, వెంకటేష్ తదితరులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడును సిఐటియు నేతలు తిరుమల కొండపై చైర్మన్ అతిథి గహంలో కలిసి సమస్యలను వివరించారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు 312 రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నారని, వారి పట్ల టిటిడి విజిలెన్స్ సిబ్బంది అధికారులు అమానవీయంగా ప్రవర్తిస్తున్నారని వారికి న్యాయం చేయాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు పర్మనెంట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమయం కేటాయించాలని, టిటిడి బోర్డులో ప్రత్యేకంగా చర్చించాలని విజ్ఞప్తి చేశారు. ఛైర్మన్ బి.ఆర్ నాయుడు సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

రెండో రోజూ స్విమ్స్ కార్మికుల రిలేదీక్ష

స్విమ్స్ కార్మికులకు శానిటేషన్ పేరును తొలగించి, వారికి జీతాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ అన్నారు. రెండో రోజూ స్విమ్స్ కార్మికుల రిలే దీక్ష సిఐటియు నాయకులు ఆర్.లక్ష్మి, పి.బుజ్జి నేతృత్వంలో కొనసాగింది. రెండో రోజు దీక్షల్లో మహిళలు జయమ్మ, ఎల్.సరస్వతి, కె.అరుణ, గౌరి, ఎస్.సుజాత, బృంద, సుభాషిణి, ఉష, నాగభూషణమ్మలకు పూలమాలలు వేసి దీక్షను కొనసాగించారు.

ఈసారి క్యాబినెట్‌లో 'శెట్టిపల్లి' భూసమస్య పరిష్కారం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శెట్టిపల్లి భూ సమస్య త్వరలో జరగబోయే క్యాబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కరించడానికి కషి చేస్తామని సిసిఎల్ఏ, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయ లక్ష్మి తెలిపారు. శుక్రవారం తిరుపతి అర్బన్ తాసిల్దార్ కార్యాలయంలో శెట్టిపల్లి భూ సమస్య సాధన కమిటీ నాయకులు ఆమెను కలిశారు. శెట్టిపల్లి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా జి.జయలక్ష్మి మాట్లాడుతూ శెట్టిపల్లి భూ సమస్యకు సంబంధించి ఫైల్ అంతా సిద్ధం అయ్యిందని, త్వరలో క్యాబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సమస్యపై పలుమార్లు జిల్లా కలెక్టర్ తో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు ఆరూరు రాధాకష్ణ, ఎన్‌డి శ్రీనివాసులు, జి. కష్ణ, గోడ్ల నాదముని, చిరంజీవి, నజీర్ బాషా, జ్యోతి రెడ్డి, రవీంద్ర, రమేష్, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉడకని అన్నం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి ఉడకని అన్నం తినలేక విద్యార్థినిలు అర్థాకలితో అలమటించిన సంఘటన గురువారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరగ్గా శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి పోతే.. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సుమారు 600 మందికి పైగా విద్యార్థినులు చదువుకుంటున్నారు. మధ్యాహ్న భోజనంలో భాగంగా వీరికి గురువారం కూరగాయలతో వండిన బిర్యానీని వడ్డించారు. అయితే అది ఉడకకపోవడంతో చాలా మంది విద్యార్థినులు తినలేక డస్ట్ బిన్ లో పారబోశారు. ప్రధానోపాధ్యాయురాలు సుచరితను వివరణ కోరగా.. వెజిటబుల్ బిర్యానీ ముద్దగా మారడంతో కొంతమంది విద్యార్థినులు తినలేకపోయారనీ, శుక్రవారం మధ్యాహ్నం విద్యార్థినులకు సాంబార్ తో కూడిన అన్నాన్ని నాణ్యతతో అందించినట్లు తెలిపారు.

వైసీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా మగ్దూమ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వైసీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎండీ మగ్దూమ్ మొహిద్దీన్‌ను ఆ పార్టీ అధిష్ఠానం రెండోసారి నియమించింది. ఈ సందర్భంగా మగ్దూమ్ సనత్ నగర్‌లో వైసీపీ నియోజకవర్గ ఇంచార్జి స్థానిక శాసన మండలి సభ్యులు మేరిగ మురళీధర్‌ను కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మగ్దూమ్, అల్తాఫ్, జహీర్, సుభహాన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఆటో నగర్‌లో రిజిస్ట్రేషన్‌లు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: నెల్లూరు నుండి డిప్యూటీ మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి గూడూరు రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కి మొట్టమొదటి సారిగా వచ్చి ఆటోనగర్ ప్లాట్స్ ఐదుగురు సభ్యులకి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మేనేజింగ్ డైరెక్టర్ మంగళగిరి అధికారితో మాట్లాడి రిజిస్ట్రేషన్ అయ్యే విధంగా చొరవ తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగా రోడ్లు, కరెంట్, అన్ని వసతులు త్వరలో మొదలు పెడతామని చెప్పారు. ఆటోనగర్‌కి శుభ ఘడియలు వచ్చాయని సభ్యులందరూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రెసిడెంట్ చాంద్ బాషా, ప్రధాన కార్యదర్శి మత్రిపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పలు వాహనాలు దారి మళ్లింపు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండవ పట్టణం, జిఎస్ రాయల్ కూడలి, అండర్ బ్రిడ్జ్ ప్రాంతంలో పలు భారీ వాహనాల ట్రాఫిక్ కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను అండర్ బ్రిడ్జి ప్రాంతం నుంచి కాకుండా ఎస్ ఆర్‌పి కూడలి, థమ్సప్ గోడౌన్ మీదుగా పంపించడం జరిగింది.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో, ఎస్‌వి పురం నివాసితులు అక్కా, తమ్ముళ్లు యువశ్రీ, శ్రీనివాస వర్మ తమ తల్లిదండ్రుల వర్ధంతి సందర్భంగా శుక్రవారం 125 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేష్, ఉపాధ్యాయులు ఓంకార్, రంగయ్య, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంగా నరసింహులు

ప్రజాశక్తి - తొట్టంబేడు: మహిళా మండల సమైక్య ఏ.పీ.ఎం గా నరసింహులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నగిరి నియోజకవర్గం నింద్ర మండలంలో ఏ.పీ.ఎంగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా తొట్టంబేడు మండల ఏ.పీ.ఎం గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మహిళా మండల సమైక్యలో ఉన్న అందరికీ అందేలా చూస్తానని తెలిపారు. ఇంతకుముందు ఇక్కడ ఏ.పీ.ఎం గా విధులు నిర్వహిస్తున్న ఇందిరాగాంధీ కె.వి. బి పురం మండలానికి బదిలీ అయ్యారు.

మోకాళ్లపై నిలబడి నిరసన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కూటమి ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాని, ఏఐటియుసి జిల్లా సమితి సభ్యులు మహేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు విజయ్ కుమార్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ ఔట్ ర్సింగ్ ఉద్యోగులు మున్సిపల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలి చాలని జీతాలతో సతమవుతున్న లక్షలాది ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గతంలో టీడీపీ ప్రభత్వ హయాంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు సంతృప్తికరంగా ఇచ్చారని, ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌లో లోపాలను సరిదిద్ది తమను ఆదుకోవాలని కోరారు. ప్రైవేటు ఏజన్సీలతో ఉద్యోగులు చాలా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదవ రోజూ కొనసాగిన ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - క్యాంపస్ :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆధ్వర్యంలో శనివారం తిరుపతి, పద్మావతి పురం రోడ్డులోని గవర్నమెంట్ ఐటిఐ కాలేజీలో మెగా జాబ్ మేళా నిర్వహించబడుతుందని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి లోకనాథం ఒక ప్రకటనలో తెలిపారు. 10 బహుళ జాతీయ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 85559 72657, 9988853335 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రోడ్లు విస్తరిస్తాం : ఎమ్మెల్యే ఆరణి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : నగరంలోని 43, 44 డివిజన్ల పరిధిలో రోడ్లను విస్తరిస్తామని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు అన్నారు. ముఖ్యంగా 44వ డివిజన్ పరిధిలోని నర్సరీ వీధిని ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు ఆక్రమణలతో అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేక ఇటీవల ఇద్దరు చనిపోయారని స్థానికులు ఎంఎల్ఎ దృష్టికి తెచ్చారు. డ్రైనేజీ సమస్యతో దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. నర్సరీ వీధికి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి 76 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికష్ణ, కార్పోరేటర్లు వరికుంట్ల నారాయణ, నరసింహాచ్చారి, నరేంద్ర, సికే రేవతి పాల్గొన్నారు.

ఈవిఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రత : కలెక్టర్

ప్రజాశక్తి - రేణిగుంట :జిల్లాకు సంబంధించిన ఈవిఎం గోడౌన్ల వద్ద నిరంతరం పటిష్ట భద్రత ఉండేలా చూసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్‌లో భద్రపరచిన ఈవిఎంలను రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ ఇంచార్జి, ఎస్డిసి సుధారాణి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, రేణిగుంట తహశీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎంసెట్, లాసెట్‌లలో విద్యార్థినుల ప్రతిభ



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఇటీవల జరిగిన ఏపీ ఎంసెట్, లా సెట్ లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని టిటిడి డీఈవో వెంకట సునీల్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి భువనేశ్వరి, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ సిలబస్ తో పాటు ప్రతివారం ఎంట్రన్స్ పరీక్షలకు సంబంధించి టెస్ట్ లు నిర్వహించి ఎప్పటికప్పుడు వారికి తగిన తర్ఫీదు ఇవ్వడం జరిగిందని వివరించారు. ఎంసెట్ ర్యాంకర్లు పి వంశిక, పీ రేవతి, ఎం శ్రీలక్ష్మి, కే సాహితీ చందన, పి లక్ష్మి, పి. శిరీష, టి. రోషిని, వి విష్ణు ప్రియ, సి హేమ, ఎం గంగోత్రి, బి లావణ్య, టి సాయి కీర్తన, లాసెట్ ర్యాంకర్లు ఎం మహాలక్ష్మి, ఏ ప్రవల్లిక, ఎం మహాలక్ష్మిలను అభినందించారు.

సంకల్పం ముందు ఓడిన వైకల్యం

■ వైద్య సదుపాయాల కొరత ■ స్థిర నివాసం లేదు ■ ఆర్థిక సాయం అరకొర ■ ప్రభుత్వ సహకారం కావాలి

దివ్యాంగుడి సేవలో..

ప్రజాశక్తి -ఏర్పేడు : సమాజంలో ఎదురైన నిర్లక్ష్యం, వివక్ష, అవకాశాల లేమి కారణంతో సైదమ్మ, పద్మజ, రాజేష్ వీరు ముగ్గురు జీవితంలో ఎన్నో ఆటంకాలు, బాధలను ఎదుర్కొన్న తరుణంలో వీరి ఆలోచనలో ఓ మిషన్, విజన్ కలిగించాయి. "వైకల్యమే మా బలం" అనే నినాదంతో, తామే తమలాంటి వారికోసం ఓ వారధి అవసరమని గ్రహించి, స్వీయ ప్రయత్నాలతో శ్రీ లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్‌ను అక్టోబర్ 18, 2022 న ఏర్పేడు మండలం, వికృతమాలలోని డెక్కన్ కాలేజ్ దగ్గర అనగుంటలో స్థాపించారు. ఈ ట్రస్ట్ వికలాంగులకు ఆసరాగా, ఆశ్రయంగా శిక్షణ, సాంత్వన కలిగించే కేంద్రంగా ఎదుగుతోంది. వీరు తమ బాధనే బలం చేసి, మరెందరికో వెలుగుగా మారారు. 2022 లో ఇద్దరు వికలాంగులతో ప్రారంభమై ప్రస్తుతం వృద్ధులు, వికలాంగులు, అనాధ పిల్లలుతో సహా మొత్తం 40 మందికి ఆసరాగా మారింది.

కోసం ప్రారంభించిన శ్రీ లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం ప్రస్తుతం అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. స్థిర నివాసం, ఆర్థిక సహాయాల లోపం, సిబ్బంది లేమి, వైద్య సదుపాయాల కొరత వృద్ధుల జీవన

అమ్మలా అన్నం పెడుతూ..

నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయి. రేషన్, ఔషధాలు, హాస్పిటల్ సదుపాయాల కోసం ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు అవసరమైంది.

సంస్థ అందిస్తున్న సేవలు..

ఆశ్రమం ప్రస్తుతం 40 మందికి పైగా సేవలందిస్తూ వీరు గౌరవంగా జీవించేందుకు సరైన వేదికగా నిలుస్తోంది. ఆశ్రమంలోని వారికి పరకాల సేవలను అందిస్తున్నారు. వాటిలో ఆశ్రయం కల్పించడం తోపాటు ఉచితంగా భోజనం, వైద్యం, దుస్తులు, మానసిక ఉల్లాసానికి ఆట, పాటలు వంటి సేవలను అందిస్తున్నారు. నిరుపేదలైన చిన్న పిల్లలకు కావలసిన పుస్తకాలు, వీధి కార్మికులకు కావలసిన భోజనం ఇంకా అవసరంలో ఉన్న వికలాంగులకు కావలసిన సాయాన్ని కూడా ట్రస్ట్ తరపున అందజేస్తున్నారు.

సవాళ్ల మధ్య సేవా యాత్ర..

ట్రస్ట్ సభ్యులు తమ సామర్థ్యాన్ని మించి కృషి చేస్తూ, వృద్ధుల సంరక్షణ కోసం నిస్వార్థంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పుడు సమాజం నుండి మరింత సహకారం అవసరమని కోరుతున్నారు. వృద్ధుల సంరక్షణ

నిర్వహణ బాధ్యత..

దాతల సహకారంతో నిర్వహిస్తున్నాం

శ్రద్ధావంతులు, సేవాపరుల అంకితభావంతో కొనసాగుతున్న ఈ ఆశ్రమం, దాతల సహకారంతో నడుస్తోందని నిర్వాహకురాలు సైదమ్మ తెలిపారు. ఎంతోమంది దాతలు మేము చేసే సేవలో తమ వంతు సహాయాన్ని అందించారని, మా సేవలను మరింత మెరుగ్గా అందించటానికి మరి కొంతమంది దాతల నుంచి సహాయం కోరుతున్నామని తెలిపారు. నిస్వార్థ సేవకు అడ్డుపడుతున్న సమస్యలపై చైతన్యం కోరుతున్నామని, ప్రభుత్వం నుండి రేషన్, వైద్య సేవలు అందిస్తే ఎంతో తోడ్పాటుగా ఉంటుందని ఆమె కోరారు.

\- సైదమ్మ, ట్రస్ట్ నిర్వహుకురాలు

తహశీల్దారు భాగ్యలక్ష్మికి సన్మానం

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి తేనేపల్లి గురుశంకర్ ప్రసాద్, మండల ఎస్సీ, ఎస్టీ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ భాగ్యలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా గురు శంకర్ ప్రసాద్ మాదిగ మాట్లాడుతూ చిన్నగొట్టిగల్లు మండలంలో ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ అండ్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జరిపి మూడు సంవత్సరాలు దాటినా, ఇంతవరకు మానిటరింగ్ కమిటీ జరపలేదని తహశీల్దారుకు తెలిపామన్నారు. వివిధ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరగా ఆమె త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

నేడు పంచాయతీ సెక్రటరీలు సామూహిక సెలవు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు శనివారం సామూహిక సెలవుపై వెళ్లనున్నారు. పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి సిపిఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ రాష్ట్ర పంచాయతీ కమిటీ పిలుపు మేరకు విధులకు హాజరు కాకూడదని నిర్ణయించారు. ఈ సందర్భంగా సెక్రటరీలు తాము ఎదుర్కొంటున్న సమస్యలు, సామూహిక సెలవు విషయమై శుక్రవారం ఎంపిడీవో వెంకటరత్నమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పివిపురం పంచాయతీ సెక్రెటరీ శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ పంచాయతీలో అన్నిరకాల సేవలందిస్తూ, చాలీ చాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామన్నారు.

ప్రజాశక్తి - సత్యవేడు: మండల పంచాయతీ కార్యదర్శులు శనివారం సామూహిక సెలవుపై వెళ్లనున్నారు. పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి సిపిఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ రాష్ట్ర పంచాయతీ కమిటీ పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఎంసీఏతో ఐటి, సాఫ్ట్‌వేర్ రంగంలో రాణింపు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఐటీ పరిశ్రమ నిరంతర అభివృద్ధి జరుగుతోందని, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, వెబ్ అభివృద్ధి, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ భద్రత, డేటా సైన్స్, కృత్రిమ మేధస్సు సంబంధిత రంగాలలో నైపుణ్యం, అంకితభావం కలిగిన ఎంసీఏ విద్యార్థులకి మంచి డిమాండ్ ఉందని, ముఖ్యంగా ఎంసీఏ చదివిన విద్యార్థులు ఐటీ, కంప్యూటర్ రంగంలో వస్తున్న నూతన పోకడల కనుగుణంగా వివిధ రకాల నైపుణ్యాలను పెంపొందించుకొని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత రంగాలలో రాణించాలని ఆర్ సి ఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ వి.రవికుమార్ చౌదరి పిలుపునిచ్చారు. తిరుపతి కరకంబాడి రోడ్డులోని ఆర్‌సిఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎంసీఏ విద్యార్థులకి గ్రాడ్యుయేషన్ డే, సీనియర్ విద్యార్థుల వీడ్కోలు సభ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిక్సన్ టెక్నాలజీస్ లిమిటెడ్, మాజీ ఉపాధ్యక్షుడు కె.పి. రాజు హాజరయ్యారు.

మండల టిడిపి అధ్యక్ష ఎన్నిక వాయిదా

ప్రజాశక్తి - పెళ్లకూరు: టిడిపిలో రెండు వర్గాల మధ్య ఆధిపత్యం పోరుతో మండల అధ్యక్ష పదవి ఎన్నిక ఆగిపోయింది. పెళ్లకూరు మండలంలో మండల సంస్థాగత ఎన్నికలను పార్టీ పరిశీలకులు శివ ప్రసాద్ వాయిదావేశారు. సీఎం ఆదేశాలు మేరకు సూళ్లూరుపేట నియోజకవర్గం, పెళ్లకూరు మండలపార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ సూళ్లూరుపేట శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ అధ్యక్షతన, నాయుడు పేటలోని టీడీపీ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులు శివప్రసాద్, వేంకటేశ్వర్ రెడ్డి, శివకుమార్‌లు పార్టీ నాయకులుతో కలసి ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. గ్రామ నాయకులు మధ్య సాయోధ్య కుదరక ఎన్నికల పరిశీలకులు శివ ప్రసాద్ తాత్కాలికంగా గ్రామ కమిటీ ఎన్నికలను వాయిదా వేశారు. గ్రామ నాయకులు ఆయా గ్రామాలలో గ్రామ కమిటీ ఎన్నికలను నిర్వహించి కమిటీకి లిస్ట్ ఇచ్చిన అనంతరం మండల పార్టీ అధ్యక్షులును ఎన్నుకోవడం జరుగుతుందని తెలియ పరిచారు. ప్రస్తుతం ఉన్న మండల అధ్యక్షుడుని కొంతమంది సపోర్ట్ చేయగా, నూతనంగా చైతన్య కృష్ణారెడ్డికి మరొక వర్గం మండల టిడిపి అధ్యక్ష పదవి ఇవ్వాలని పోటీ పడడంతో ఎన్నిక విధానం ఉత్కంఠ పరిస్థితుల్లో వాయిదా పడింది.

మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్.బి.ఏ పరిశీలన

ప్రజాశక్తి -క్యాంపస్ : శ్రీ పద్మావతీ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను శుక్రవారం నేషనల్ బోర్డు అక్రిడిటేషన్ (ఎన్.బి.ఏ) ప్రతినిధులు పరిశీలించారు. కళాశాలలో ఎన్.బి.ఏ పునరుద్ధరణకు న్యూఢిల్లీ నుండి ఎన్.బి.ఏ నిపుణుల బృందం కళాశాలలో ప్రయోగశాలలు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది వివరాలు, రికార్డులు పరిశీలించారు. కళాశాలలో బోధన, ల్యాబ్స్, లైబ్రరీ, బోధన తదితర అంశాలపై విద్యార్థుల నుండి ఫీడ్ బ్యాక్ సేకరించారు. గతంలో శ్రీ పద్మావతీ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు మూడేళ్ల పాటు ఎన్.బి.ఏ అనుమతి లభించింది. గడవు ముగియనుండడంతో ఎన్.బి.ఏ ప్రతినిధులు పాలిటెక్నిక్ కళాశాలలో ఇన్స్పెక్షన్ నిర్వహించారు. ఈ ఎన్.బి.ఏ ఇన్స్పెక్షన్ కు సహకరించిన టిటిడి మేనేజ్మెంట్ కు, టిటిడి విద్యాశాఖాధికారికి, కళాశాల బృందానికి ప్రిన్సిపాల్ పద్మావతమ్మ ధన్యవాదాలు తెలిపారు.

నేరాల నియంత్రణకు సహకరించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిని నేరరహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ అహర్నిశలు శ్రమిస్తోందని, ఆటోవాలాలు సైతం నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో శుక్రవారం నాగార్జున్ రెడ్డి ఆటోవాలాలకు ట్రాఫిక్ నిబంధనలు, నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. కొంతమంది నేరస్తులు భక్తుల ముసుగులో లాడ్జిలలో తిష్ట వేస్తున్నారని, అదును చూసి చోరీలకు పాల్పడుతున్నట్లు వివరించారు. అలాంటి అనుమానాస్పద వ్యక్తులు ఆటోల్లో ఒక చోట నుండి మరో చోటికి ప్రయాణిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తమ వంతు సామాజిక బాధ్యతగా ఆటోవాలాలు ఈ తరహా సాయాన్ని అందించాలని సూచించారు.

జిల్లా ప్రజా రవాణా అధికారిగా జగదీష్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి తిరుపతి సిటీ : చిత్తూరు జిల్లా ప్రజా రవాణా అధికారిగా విధులు నిర్వహిస్తున్న జగదీష్ తిరుపతి అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఏపీఎస్ఆర్టీసీ తిరుపతి రీజనల్ కార్యాలయం వద్దకు చేరుకున్న ఆయనకు అక్కడ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటిఎం విశ్వనాధ్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ బాలాజీ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ట్రాన్స్ఫార్ మరమ్మతులు, ట్రీ కటింగ్ తదితర కారణాలతో శనివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం ఏర్పడనున్నట్లు తిరుపతి డివిజనల్ ఈఈ చంద్రశేఖర రావు ఒక ప్రకటనలో తెలిపారు. బైరాగి పట్టెడ, హథీరాంజీ కాలనీ, భగత్ సింగ్ కాలనీ, ఎస్‌టివి నగర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

ఈ జాతీయ రహదారి పూర్తయితే..

కడపకు 2 గంటలే ప్రయాణం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో :ఈ జాతీయ రహదారి పూర్తయితే తిరుపతి – కడప మధ్య రెండు గంటలే ప్రయాణం. గంట ప్రయాణం కలిసొస్తుంది. త్వరలోనే నిర్మాణ పనులు మొదలు కానున్నాయి. రేణిగుంట నుంచి కడప వరకు 130 కిలోమీటర్ల మేర ఈ హైవే ఉంటుంది. ఈ రోడ్డు తిరుపతి, కడప, అన్నమయ్య జిల్లాల మీదుగా వెళ్తుంది.. అయితే రెండేళ్ల క్రితమే ఈ హైవే విస్తరణకు సంబంధించి ఒప్పందం జరిగింది.. అయితే అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో ఈ హైవే పనులు మొదలు పెట్టలేదు. ఇప్పుడు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతులు రావడంతో రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి.. ఈ మేరకు కేంద్ర మంత్రి గడ్కరీ కార్యాలయం ఈ విషయాన్ని తెలిపింది. ఎన్‌హెచ్ 716 నిర్మాణానికి రూ.2,348 కోట్లు వెచ్చించారు. కడప నుంచి రెండు గంటల్లో తిరుపతికి చేరుకోవచ్చు. ఈ హైవేకు సంబంధించి 31 కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం ఉంది. అక్కడ వన్యప్రాణులు ఎక్కువగా తిరుగుతుంటాయి. అందుకే అటవీ శాఖ నుంచి అనుమతి ఇవ్వలేదు. అనంతరం బెంగళూరులోని వన్యప్రాణుల సంరక్షణ జాతీయ బోర్డు అధికారులు వచ్చి అక్కడ పరిస్థితిని పరిశీలించారు. అటవీ ప్రాంతంలో జంతువులకు ఇబ్బందులు లేకుండా అండర్‌పాస్‌లు (రోడ్డు కింద నుంచి జంతువులు వెళ్లడానికి దారులు) నిర్మించాలని సూచనలు చేశారు. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఏఐ (జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ) అంగీకరించడంతో అటవీ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఉద్యమాల రూపశిల్పి బొజ్జా తారకం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఉద్యమాల రూపశిల్పి బొజ్జా తారకం అని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి. అంజయ్య కొనియాడారు. స్థానిక ఎం.ఆర్. పల్లిలోని ఆర్పిఐ కార్యాలయము వద్ద ప్రముఖ కవి ,రచయిత గొడుగు చింత గోవిందయ్య అధ్యక్షతన బొజ్జా తారకం 86వ జయంతి సభ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పి. అంజయ్య మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో దళిత, ఆదివాసీ, ఇతర పేద వర్గాలపై దాడులు, అత్యాచారాలు జరిగినప్పుడు వందలాది ప్రజా సంఘాలను, సంస్థల్ని, ఉద్యోగ సంఘాల్ని ఐక్యపరిచి, ఉద్యమాలు రూపొందించి, స్వయంగా నాయకత్వం వహించారని తెలిపారు. కారంచేడు ,చుండూరు ,లచ్చంపేట, అత్యాచార సంఘటనల్లో బాధితుల పక్షాన నిలిచి, ఒకవైపు న్యాయపోరాటం, మరోవైపు గ్రామస్థాయి నుండి జాతీయస్థాయి వరకు రాజీలేని పోరాటాలు నిర్వహించిన చరిత్ర బొజ్జా తారకంకు దక్కుతుందన్నారు. అన్యాయాలను ఎదిరించకపోతే అన్యాయమే రాజ్యమేలుతుందని నినదించిన గొప్ప మానవతావాది బొజ్జా తారకం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బొజ్జా తారకం కాలనీ అధ్యక్షులు మేకల బాబు, కాలనీ యువకులు కిషోర్, రాజేష్, హర్ష మన్మథ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు ఏ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చెవిరెడ్డి అరెస్టును నిరసిస్తూ.. వైసీపీ నాయకుల ధర్నా

ప్రజాశక్తి - రామచంద్రపురం : చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ.. వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు ఆర్‌సి పురంలో ధర్నా నిర్వహించారు. శుక్రవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి నాయకులు తరలివచ్చారు. రామచంద్రపురం కూడలి వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. కానీ ఆర్సిపురం పోలీసులు ధర్నాకు అనుమతులు లేవని హెచ్చరించారు. అయినప్పటికీ వారు రోడ్డెక్కి కూర్చుని నిరసన తెలిపారు. చెవిరెడ్డి అరెస్ట్ అక్రమమంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో దామినేటి కేశవులు, చిన్ని యాదవ్, చంద్రమోహన్ రెడ్డి, మాధవరెడ్డి, చంద్రారెడ్డి, ఎంపీపీ ఏవి బ్రహ్మానంద రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు నూతన ద్విచక్ర వాహనాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: డిజిపి హరీష్ కుమార్ గుప్తా శుక్రవారం తిరుపతి జిల్లాకు నూతనంగా 27 ట్రాఫిక్ ద్విచక్ర వాహనాలను అందజేశారు. తిరుపతి పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నూతన ట్రాఫిక్ ద్విచక్ర వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ ట్రాఫిక్ ఎన్ ఫోర్స్ మెంట్ కోసం నూతన టెక్నాలజీతో వాహనాలు రావడం మాకు సంతోషంగా ఉందన్నారు. 2020 లో 15 వాహనాలు కేటాయించగా, 2025 లో తిరుపతి జిల్లాకు 27 వాహనాల కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, నాగభూషణం రావు, చంద్రశేఖర్, డిఎస్పీలు శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారితే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: మహిళలు సాంకేతికతను అందిపుచ్చుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. మహిళా సాధికారిత కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. శుక్రవారం ఉదయం సిఎల్ టి సెంటర్‌లో మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. 169 ఆర్పీలకు గాను 153 మందికి ట్యాబ్‌లు అందచేశారు. ట్యాబ్‌లో 60 యాప్‌లు ఉన్నాయని, అన్నీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సర్వేలకు సంబంధించినవని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఎంఎంలు కృష్ణవేణి, సోమశేఖర్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, సిఓలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు, దివ్యాంగులకు ముందుగానే రేషన్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వడమాల పేట మండలం, లక్ష్మీపురంలో రేషన్ డీలర్ సుబ్బరామయ్య శెట్టి శుక్రవారం రేషన్ పంపిణీ చేపట్టారు. నగరి నియోజకవర్గం, గ్రామ పంచాయతీలలో వృద్ధులతోపాటు దివ్యాంగులకు జూలై నెల కోటా రేషన్ ముందుగానే అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వారికి ప్రతి నెల 25 నుంచి 30 తేదీలోపే ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశాలని తెలిపారు.

వేడుకగా ధ్వజారోహణం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ దేవాలమైన ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజారోహణ నిర్వహించారు. దీంతో ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగినట్లు అయింది.

క్రైం న్యూస్

భవనంపై నుండి జారిపడి పెయింటర్ మృతి

మృతి చెందిన రామ్మూర్తి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : పొట్ట కూటి కోసం కూలి పనికి వచ్చిన ఓ పెయింటర్ ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు నుండి పడి మృతి చెందిన ఘటన శుక్రవారం నగరంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు తిరపతి శివ జ్యోతి నగర్‌లో కాపురం ఉంటున్న పెయింటర్ రామ్మూర్తి (35) పెయింటింగ్ పని చేసు కుంటూ జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తిరుపతి వివి మహల్ రోడ్డు లోని భవనానికి పెయింటింగ్ చేసేందుకు వెళ్లాడు. భవనానికి పెయింట్ కొడుతుండగా ప్రమాదవశాత్తు నాలుగవ అంతస్తు నుండి జారి కింద పడి, తీవ్ర గాయాలు పాలయ్యాడు. చుట్టుపక్కల వారు అతని ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడు. దీనిపై పోలీసులకి ఎలాంటి ఫిర్యాదు లేదని సమాచారం.

25 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి : సిఐటియు

భవనం పై నుండి జారిపడి మృతి చెందిన పెయింటర్ రామ్మూర్తి (35) కుటుంబానికి 25 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిఐటియు నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎండి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరాడు.

ఐదుగురు గంజాయి స్మగ్లర్లు అరెస్ట్

ప్రజాశక్తి - సూళ్లూరుపేట: సూళ్లూరుపేటకు సమీపంలోని మన్నారు పోలూరు వద్ద అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురు యువకులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 3.5 లక్షలు విలువ చేసే 20 కిలోల గంజాయితో పాటు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశంలో డీఎస్పీ చెంచుబాబు వివరాలు తెలియజేసారు. సత్యవేడు ప్రాంతానికి చెందిన తొండా మునిశేఖర్, షోడవరం జ్యోతిష కుమార్, సూళ్లూరుపేట ప్రాంతానికి చెందిన ఏలింబేటి సునిల్, పాల వినయ్, తడ ప్రాంతానికి చెందిన ముద్దు రాజేష్ అనే ఐదుగురికి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

బావిలో పడ్డ శునకం.. కాపాడిన ఫైర్ సిబ్బంది

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణంలోని పద్మశాలి పేట బోయ జ్ఞానమ్మ దిగుడు బావిలో గురువారం రాత్రి శునకం దాని పిల్ల ప్రమాదవశాత్తు పడిపోయాయి. శుక్రవారం ఉదయం మూగ జీవాల రోదనను విన్న స్థానికులు టిడిపి నేతలు మునిరాజా యాదవ్, ఉమేష్ రావుకు తెలియజేశారు. వారు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన అక్కడికి చేరుకుని రెస్క్యూ చేసి శునకం, దాని పిల్లను సురక్షితంగా బయటకు తెచ్చారు. మూగజీవాలను రక్షించడంలో చొరవ చూపిన టిడిపి నేతలకు, ఫైర్ సిబ్బందికి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

బీసీ హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి- ఏర్పేడు: ఏర్పేడు బిసి బాలుర వసతి గృహాన్ని ఏర్పేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పారా మెడికల్ సిబ్బంది సందర్శించారు. వసతి గృహ పరిసరాలను, తాగు నీటిని పరిశీలించి సూచనలు చేశారు. విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్‌లు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ప్రైవేట్ ఆసుపత్రి ప్రాంగణంలో జూన్ 29వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆసుపత్రి అధినేత డాక్టర్ రాజేంద్రన్ పేర్కొన్నారు. మిషన్ ఫర్ విజన్ ఆధ్వర్యంలో చెన్నై శంకర్ నేత్రాలయ వైద్య బృందం రోగులను పరీక్షించి చికిత్స చేస్తారని తెలిపారు.ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తిరుమలలో హాకర్స్ లైసెన్స్‌ల తనిఖీ

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: తిరుమలలో వ్యాపారస్తులు నియమ, నిబంధనలు ప్రకారం వ్యాపారం చేసుకోవాలని, అతిక్రమించి హద్దులు దాటిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి హెచ్చరించారు. శుక్రవారం తిరుమలలో హాకర్ లైసెన్సులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎస్టేట్ ఆఫీసర్ వేంకటేశ్వర్లు , టాస్కోర్స్, రెవెన్యూ విభాగం విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి మ్యానిఫెస్టో ఏమయ్యింది? : వైసిపి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సీఎం చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ పథకాలను, మేనిఫెస్టోనూ మరచిపోయినట్లున్నారని, వైసిపి ఆధ్వర్యంలో గుర్తు చేస్తున్నామని నేతలు 'పోస్టర్‌ను ఆవిష్కరించారు. రీజినల్ కోఆర్డినేటర్‌పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపి గురుమూర్తి, ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తి సమన్వయ కర్తలు అభినయ్‌రెడ్డి, విజయానందరెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలోనూ జగన్నాథుని రథయాత్ర

ప్రజాశక్తి - క్యాంపస్: 'జగన్నాథుని ఆశిస్సులు విశ్వ విద్యాలయంపై, భక్తులపై సర్వదా ఉండాలి' అని ఇస్కాన్ వైస్ ప్రెసిడెంట్ రూపేశ్వర్ చైతన్య ప్రభు, రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావు అన్నారు. జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలోని ఒడిస్సా చైర్ ఆధ్వర్యంలో జగన్నాథ కల్చర్ అండ్ చైతన్య ఫిలాసఫీ రీసెర్చి సెంటర్‌లో జగన్నాథ రథయాత్ర శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొ.ఎస్.దక్షిణామూర్తి శర్మ జగన్నాథుని రథయాత్ర ఔన్నత్యాన్ని వివరించారు. ఈ రథయాత్ర యూనివర్సిటీ నుంచి మున్సిపల్ ఆఫీసు, గాంధీరోడ్డు, బాలాజీ కాలనీ మీదుగా సాగింది. విశ్వవిద్యాలయ ఫినాన్స్ ఆఫీసర్ ప్రొ.రాధాగోవింద త్రిపాఠి, ఒడిస్సా చైర్ అడ్వైజర్ ప్రొ.జి.శంకరనారాయణ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - రామచంద్రాపురం : మండల పరిధి, కమ్మ కండ్రిగలోని నాగమ నాయుడు ఎర్రమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు.

బాకరాపేటలో ఎడ్యు పాఠశాల ప్రారంభం

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: భాకరాపేట ఘాట్ రోడ్‌లో కార్పొరేట్ స్థాయి ఎడ్యు వ్యాలీ పాఠశాలను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. పాఠశాల గదులను పరిశీలించారు. పాఠశాల చైర్మన్ స్కూల్లో ఏర్పాటు అయిన వసతులను, సాంకేతికత విద్యను ఎమ్మెల్యే పులివర్తి నానికి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు బెల్లంకొండ మురళి క్లస్టర్ ఇంచార్జ్ కొట్టేసి ఒక కుమార్ నాయకులు ఆర్.వి రమణారెడ్డి తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, అడిషనల్ ప్రోజెక్ట్ కోర్డినేటర్ శంకరరావు శుక్రవారం మండల విద్యాశాఖధికారి కార్యాలయాన్ని సందర్శించారు. తదుపరి బియన్ కండ్రిగ, నెలవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యా మిత్ర కిట్ల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించారు. అనంతరం బియన్ కండ్రిగ భవితా సెంటర్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, సుబ్రహ్మణ్యం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు రమణయ్య, కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, నెలవాయి ప్రధానోపాధ్యాయులు హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.